ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 1 ఆగస్టు 2024 | 5





ధవళేశ్వరం వద్ద

నిలకడగా గోదావరి

7లో

రోడ్డుపై వంట.. గుడిలో నిద్ర..

వరద తెచ్చిన కష్టం

వరద కష్టాలు ఒక్కొక్కరికి ఒక్కోలా ఉన్నాయి. పంట మునిగి కొందరు బాధపడుతుంటే గూడు కోల్పోయి కొందరు బాధపడుతున్నారు. పి.గన్నవరం మండలం కె.ముంజవరం గ్రామానికి చెందిన కొల్లు రాధాకృష్ణ, నాగమణి దంపతుల కష్టం అలాంటిదే. కె.ముంజవరం వద్ద గోేరింకల డ్రైన్ పోటెత్తడంతో డ్రైన్ చెంతనే ఉన్న వారి తాటాకిల్లు నీటమునిగింది. ఇంటి గోడలు కూలిపోవడంతో పాటు పైకప్పు సైతం పాడైంది. దీంతో వారు నిలువ నీడ లేకుండా అయిపోయారు. రోడ్డుపై వంట చేసుకుని రాత్రి సమయంలో ఎదురుగా ఉన్న ఆలయంలో నిద్రిస్తున్నారు. ఇల్లు కోల్పోయి చాలా ఇబ్బందులు పడుతున్నామని కనీసం ఎవరూ పట్టించుకోలేదన్నారు. రెవెన్యూ సిబ్బంది వచ్చి సచివాలయం తలుపులు తీస్తామని చెప్పారని ఇప్పటి వరకు తీయలేదన్నారు. వరద ముంపు పోయే వరకు తమకు ఉపశమనం కలిగించాలని వృద్ధ దంపతులు కోరుతున్నారు

● పి.గన్నవరం



రోడ్డుపై వంట చేసుకుంటున్న వృద్ధురాలు

653 ఎకరాల్లో పంట నష్టం

ముమ్మిడివరం, జూలై 31: వరదల కారణంగా లంక భూముల్లో సాగు చేసిన కూర పాదులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంట చేతికి వస్తున్న తరుణంలో వరదలు ముంచెత్తడంతో కాయగూరల పంటలన్నీ ముంపు బారిన పడి కుళ్లిపోయాయి. మండలంలోని గురజాపులంక, కూనాలంక, లంకాఫ్ ఠాణేలంక, చింతపల్లిలంక, గేదెల్లంక, సలాదివారిపాలెం, వలసలతిప్ప తదితర లంక గ్రామాల్లో 653.5 ఎకరాల్లో బెండ, బీర, వంగ, మునగ, ఆనబ, మిర్చి, బొప్పాయి వంటి పంటలు నీట మునగడంతో దెబ్బతిన్నాయి. గత వారం రోజులుగా వరదనీరు పెరుగుతూ, తగ్గుతూ ఉండడంతో లంక గ్రామాల్లో సాగుచేసిన వాణిజ్య పంటలన్నీ ముంపులో చిక్కుకుని నష్టం వాటిల్లింది. సుమారు రూ.కోటి 96 లక్షల మేర నష్టం ఏర్పడింది. జూన్, జూలై నెలల్లో రైతులు సాధారణంగా కూరపాదులు సాగు చేస్తారు. ఎకరాకు 30 నుంచి రూ.40వేల వరకు పెట్టుబడి అయిందని, కాపు చేతికి వస్తున్న తరుణంలో వరదలు ముంచెత్తడంతో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరదలతో నష్టపోయిన వాణిజ్య పంటలకు ఉద్యానశాఖ అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. వరదనీరు తొలగిన తర్వాత పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి నష్టాలను ప్రభుత్వానికి నివేదిస్తామని మండల ఉద్యానవన శాఖాధికారి లక్ష్మీప్రసన్న తెలిపారు.

ముమ్మిడివరం: గురజాపులంకలో కుళ్లిన మిర్చి





ముమ్మిడివరం: కూనాలంకలో దెబ్బతిన్న బెండతోట



లంకాఫ్ ఠాణేలంకలో ముంపులో బెండతోట

● వరద నుంచి తేరుకుంటున్న గ్రామాలు
● ముంపు ప్రాంతాల్లో తేలుతున్న నష్టాలు
● కుళ్లిపోయిన కూరగాయల పంటలు
● నిండా మునిగిన వరిచేలు
● ఎక్కువగా దెబ్బతిన్న వాణిజ్య పంటలు

వరద పోయి..బురద మిగిలింది..రైతుల కష్టం చెదిరిపోయి నష్టం మిగిలింది..జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పుడు పరిస్థితులు చాలా దయనీయంగా ఉన్నాయి. పొలాలు, ఇళ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. వరద.. రైతు నడ్డి విరిచింది. చాలా మందికి గూడును దూరం చేసింది..మోకాల్లోతు బురదతో నివాసాలు నిండిపోయాయి.

వరద నష్టం



వై.కొత్తపల్లిలో పనుపు రంగులో మారిన బీర



పి.గన్నవరం: వై.కొత్తపల్లిలో నీటమునిగిన వరిచేలు

బ్యాక్ వాటర్‌తో ఇళ్లు,పొలాలకు దెబ్బ

పి.గన్నవరం, జూలై 31: కె.ముంజవరంలో లాకులు వద్ద మూడు ప్రధాన డ్రైన్లలో నీరు గోదావరిలో కలిసిపోతోంది. అయితే గత వారం రోజులుగా గోదావరి వరద పోటెత్తి లాకులు తలుపులు నుంచి గోదావరి జాలాలు వెనక్కి మరలడంతో డ్రైన్లు వెంబడి నీరు సమీప పంట పొలాలతో పాటు పలు చోట్ల ఇళ్లు సైతం నీటమునిగాయి. ముఖ్యంగా వై.కొత్తపల్లి, ముంగండపాలెం, ముంజవరపుకొట్టు, కె.ముంజవరం ప్రాంతాలలో పంట చేలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పలు తాటాకిళ్లు మునిగిపోవడంతో పాటు వరి, కూరగాయలు, అరటికి నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. వై.కొత్తపల్లిలో అయితే వరిచేలు వరద ముంపు నుంచి ఇంకా తేరుకోలేదు. నీట మునిగిన తాటాకిల్లు తేరుకున్నప్పటికి గోడలు అండలుగా ఊడిపోతున్నాయి. గోదావరి ప్రస్తుతం శాంతించడంతో ఆ ప్రాంత వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

వరద పోయింది.. బురద మిగిలింది



మానేపల్లిలో ఓ ఇంటిలో బురద



గంటిపెదపూడి వద్ద కాజ్‌వే

పి.గన్నవరం, జూలై 31: గోదావరి వరద ఉధృతి తగ్గుతోంది. ధవళేశ్వరంలో మాత్రం మధ్యాహ్నం నుంచి నిలకడగా ప్రవహిస్తోంది. దిగువన నదీపాయలు మాత్రం ఇంకా నిండుగానే ప్రవహిస్తున్నాయి. పి.గన్నవరం మండలంలో ఇప్పుడిప్పుడే కాజ్‌వేలు వరద ముంపు నుంచి తేరుకుంటున్నాయి. గత నాలుగు రోజులుగా ఉధృతంగా ప్రవహించిన కె.ఏనుగుపల్లి, గంటిపెదపూడి దిగువన కాజ్‌వేలు వరద ముంపు నుంచి తేరుకోవడంతో ఆయా లంక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మానేపల్లి శివారు శివాయిలంక, పల్లిపాలెం గ్రామాలు వరద ముంపు నుంచి తేరుకోవడంతో వరదనీరు పేరుకుపోయిన బురదను గెంటుకోవడంతో పాటు మట్టి గోడలను సరిచేసుకుంటున్నారు. వరద ఉధృతి తగ్గడంతో పడవలు తిరిగే పరిస్థితి లేకపోవడంతో శివాయిలంక గ్రామస్తులు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే గంటిపెదపూడి, ఉడిమూడి శివారు నాలుగు లంక గ్రామాలతో పాటు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పలు లంక గ్రామాలు ఇంకా నాటు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నాయి.

అమ్మో..కొండచిలువ



అంబాజీపేట, జూలై 31: భారీ వర్షాల కారణంగా వరదలు రావడంతో కొండచిలువలు రోడ్లపై హల్‌చల్ చేస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మార్కెట్ యార్డు సమీపంలో బుధవారం 8 అడుగుల కొండచిలువ రోడ్డుపైకి రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి దానిని హతమార్చడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పాడి రైతులకు ఉచితంగా పశుగ్రాసం

కలెక్టర్ మహేష్‌కుమార్

అయినవిల్లి, జూలై 31: గోదావరి వరద ముంపు ప్రభావంతో పచ్చికబయళ్లు, ఎండుగడ్డి ముంపు బారిన పడడంతో పశుగ్రాసం లభించక ఇబ్బందులు పడుతున్న పాడి రైతులకు టోటల్ మిక్సర్ రేషన్ (దాణా)ను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. పొట్టిలంకలో బుధవారం పశుగ్రాస దాణా పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పశువులు ఆకలితో అలమటించకుండా 25 కిలోల వంతున ఐదు రోజులకు సరిపడా దాణాను ఉచితంగా అందజేశారు. అయినవిల్లి మండలంలోని పశువుల కోసం 32 టన్నుల టీఎమ్మార్‌ను పశుసంవర్థకశాఖ ద్వారా ఉచితంగా సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి వెంకట్రావు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ చీకట్ల వెంకటనారాయణ, డాక్టర్ రేవంత్‌కుమార్, డాక్టర్ నారాయణరావు, డాక్టర్ జి.శ్రీను, ఎం.నాగమణి, తహసీల్దార్ ప్రమద్వర, ఎంపీడీవో టి.సూర్యనారాయణమూర్తి, మామిళ్లపల్లి తాతాయ్యనాయుడు, మేడిద దుర్గాప్రసాద్, గుర్రాల రాంబాబు, వడ్డి శ్రీను పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి సీఆర్‌జెడ్ సవరణ



మాట్లాడుతున్న జేసీ నిషాంతి

మత్స్యకార సంఘాల ప్రతినిధులతో జేసీ నిషాంతి సమావేశం

అమలాపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతాల్లోని మత్స్యకార సంఘాలు, స్థానికుల జీవనోపాధి భద్రత కోసం 2019 సీఆర్‌జెడ్‌ను సవరించినట్లు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. తీర ప్రాంతంలోని పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు సహజ ప్రమాదాలను పరిగణలోకి తీసుకుని 2011 సీఆర్‌జడ్ కంటే మెరుగైన సీఆర్‌జెడ్‌ను తీసుకువచ్చిందని వివరించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో బుధవారం 2019 కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ ముసాయిదా ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియపై మత్స్యకార సంఘాల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం కోస్టల్ రెగ్యులేటరీ జోన్ పరిమితి 50 మీటర్ల వరకు నిర్ధారించారన్నారు. సవరించిన సీఆర్‌జెడ్‌లో పర్యావరణ, కాలుష్య నియంత్రణ, పర్యాటకపరంగా, మత్స్య సంపదతో పాటు బహుముఖ ప్రయోజనాలు కల్పించారన్నారు. మత్స్యకార సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ 2019 సీఆర్‌జెడ్ ప్రతిపాదనలో మార్పులు చేయాలని కోరారు. కోస్టల్‌జోన్ పరిధిని 500 మీటర్ల వరకు విస్తరించాలన్నారు. చమురు సంస్థలు, పర్యావరణానికి తీరని ముప్పు కలుగజేస్తున్నాయని వివరించారు. వాటిని నివారించాలని మత్స్యకార సంఘాల నాయకులు వినతులు అందజేశారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజనీర్ సందీప్‌రెడ్డి, మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠినచర్యలు

- జేసీ నిషాంతి

రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు జేసీ టి.నిషాంతి చెప్పారు. ఐవీఆర్ఎస్ సిస్టమ్ ద్వారా ఫిర్యాదులు వస్తున్నాయని, రేషన్ సరుకుల సరఫరాలో మార్పులు చేయాలని కోరుతున్నారన్నారు. మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ల ద్వారా నిత్యావసరాలు సరఫరా చేయడం వల్ల చాలా ఇబ్బందులు ఉన్నాయని, పూర్వపు డీలర్ల వ్యవస్థను పునరుద్ధరించాలని కోరుతున్నారన్నారు. పౌరసరఫరాల వ్యవస్థ బలోపేతానికి క్షేత్రస్థాయి నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వసతి గృహ సంక్షేమ అధికారులు, పౌరసరఫరాల అధికారులతో బుధవారం జేసీ నిషాంతి సమావేశమయ్యారు. వసతిగృహ అధికారులు మాట్లాడుతూ పోర్టిఫైడ్ స్టీమ్డ్ రైస్ సరఫరా చేస్తే మంచిదని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద డిప్యూటీ తహసీల్దార్లను నియమించి రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్‌వో ఎ.పాపారావు, ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి, సోషల్ వెల్ఫేర్ జేడీ పి.జ్యోతిలక్ష్మీదేవి, డీఈవో ఎం.కమలకుమారి, రెసిడెన్షియల్ పాఠశాలల అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల పహారాలో కూనవరం స్ట్రయిట్ కట్ పనులు

- కూనవరం స్ట్రయిట్ కట్ పనులు ప్రారంభం
- ఇప్పటికే రెండు వర్గాల మధ్య నడుస్తున్న వివాదం
- పోలీసు హెచ్చరికలతో సవ్యంగా సాగిన పనులు





పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

వివాదాల కూనవరం స్ట్రయిట్‌కట్ పునరుద్ధరణ పనులు భారీ పోలీసు బందోబస్తు నడుమ బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పనులపై రెండు వర్గాల మధ్య వివాదం నడుస్తుండడంతో పోలీసుల పర్యవేక్షణలో ఉద్రిక్తతలు లేకుండా చర్యలు తీసుకున్నారు..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

కూనవరం స్ట్రయిట్‌కట్ తవ్వడం వల్ల తమకు నష్టం కలుగుతుందని ఒక వర్గం, ఎట్టి పరిస్థితుల్లోను తవ్వాల్సిందే అంటూ మరో వర్గం పట్టుబడుతున్న నేపథ్యంలో ఎట్టకేలకు భారీ పోలీసు బందోబస్తు నడుమ స్ట్రయిట్‌కట్ పనులు లాంఛనంగా ప్రారంభించారు. కూనవరం డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న స్ట్రయిట్‌కట్ ద్వారా మురుగునీరు నేరుగా సముద్రంలో కలిసేందుకు కూనవరం మొగ ప్రధాన భూమిక పోషిస్తుంది. సముద్రపు ఆటుపోట్ల సమయంలో భారీగా ఆ మొగను ఇసుక మేటలతో కప్పేయడం వల్ల కూనవరం డ్రెయిన్ గుండా వచ్చే నీరు నేరుగా సముద్రంలో కలిసే పరిస్థితులు లేవు. దాంతో సమీప గ్రామాల పొలాలు, చెరువులకు ముంపు తీవ్రత పెరుగుతుంది. ఈ నేపథ్యంలో కూనవరం స్ట్రయిట్‌కట్ తవ్వకానికి ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్ణయించారు. దీనిలో భాగంగా సుమారు రూ.35 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టాలని భావించారు. అయితే రైతులు వర్గాలుగా విడిపోయి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సమక్షంలోనే వాదులాటకు దిగారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో పనులు ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. ఇద్దరు సీఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసుల బృందం కూనవరం స్ట్రయిట్‌కట్ వద్ద పరిస్థితిని సమీక్షించారు. వారి సమక్షంలో డ్రైనేజీ శాఖ అధికారులు ఎక్సకవేటర్‌తో పనులు ప్రారంభించారు. కూనవరం స్ట్రయిట్ కట్ ఉన్న ప్రాంతంలో నీటిలోనే ఎక్సకవేటర్‌తో పనులు చేస్తున్నారు. ముంపు నీరు దిగేందుకు వీలుగా ఈ మొగను పునరుద్ధరించడం వల్ల నష్టం కలిగేది ఎవరికి.. లాభం చేకూరేది ఎవరికనే దానిపై వైరి వర్గాల రైతులు అంచనాలు వేస్తూ పనులు జరుగుతున్న తీరుపై నిఘా పెట్టారు. రానున్న రోజుల్లో మరిన్ని ఎక్సకవేటర్లు పెట్టి త్వరితగతిన పనులు పూర్తిచేసేందుకు డ్రైనేజీశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే బుధవారం స్ట్రయిక్ కట్ పనులు ప్రారంభిస్తున్న సమయంలో పనులు వద్దన్న రైతులెవరూ ఆ ప్రాంతానికి రాలేదు. పోలీసులు ముందుగానే హెచ్చరికలు జారీ చేయడంతో కేసుల భయంతో రైతులు ఆ ప్రాంతానికి రాలేదని సమాచారం. అయితే పనులు వ్యతిరేకించే వర్గం కలెక్టర్ మహేష్‌కుమార్‌ను కలిసేందుకు సమయాత్తమవుతున్నట్టు తెలిసింది.

ఇసుక పంపిణీ ఫిర్యాదులను పరిష్కరించాలి

- ఎప్పటికప్పుడు విచారించి నివేదికలు సమర్పించాలి
- కాంట్రాక్టర్ల వద్ద అక్రమంగా ఉన్న ఇసుక లెక్క తేల్చాలి
- అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ మహేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, జూలై 31: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత ఇసుక పంపిణీపై వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పూర్తిగా విచారించి పరిష్కరిస్తూ నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో కాంట్రాక్టర్ల వద్ద అక్రమంగా నిల్వ ఉన్న పది ఇసుక గుట్టలపై పూర్తిస్థాయిలో విచారించాలన్నారు. ఆ నిల్వలకు సంబంధించిన సరైన ఆధారాలు సమర్పించని పక్షంలో ఇసుక నిల్వలను వేలం వేస్తామన్నారు. టోల్‌ఫ్రీ నంబరు ద్వారా అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. జిల్లాలో స్టాకు యార్డుల ద్వారా ఇసుక సరఫరా అవుతుందని, జొన్నాడ స్టాకు యార్డు ముంపులో ఉందని తెలిపారు. మత్స్యకార సొసైటీల వద్ద ఉన్న బోట్ల స్థితిగతులు, ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలను నివేదికగా సమర్పించాలన్నారు. స్టాకు యార్డుల వద్ద వాహనాల వెయిటింగ్‌కు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలని, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. సమావేశంలో ఖనిజాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ జియాలజిస్ట్ జి.కృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్ వి.సుజాత, ఆర్డీవోలు ఎస్.సుధాసాగర్, జి.కేశవర్ధనరెడ్డి, జేవీవీ సత్యనారాయణ, మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు, డీటీవో అశోక్‌ప్రతాప్‌రావు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యలపై సమీక్ష..

గోదావరి వరద సహాయక చర్యలపై కలెక్టరేట్‌లో బుధవారం మండల ప్రత్యేకాధికారులు, జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సమీక్ష నిర్వహించారు. 2022 గోదావరి వరదల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణను అమలు చేయడం సత్ఫలితాలను ఇచ్చిందన్నారు. పునరావాస కేంద్రాల్లోని ముంపు బాధితులకు అందుతున్న సాయం, నిత్యావసర వస్తువుల పంపిణీపై ప్రత్యేక అధికారులతో మండలాల వారీగా సమీక్షించారు.

ఆలయాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

వార్త..7లో

పోలవరం పునరావాస కల్పనే..

వరదలకు శాశ్వత పరిష్కారం

- పోలవరం గరిష్ఠ స్థాయిలో గోదావరి వరద ముంపు
- గతంలో చింతూరు ఐటీడీఏ పీవో నివేదికను పట్టించుకోని జగన్ ప్రభుత్వం

(రంపచోడవరం)



విలీన మండలాల్లో ముంపులో ఓ గ్రామం

గోదావరి పరీవాహక ప్రాంతంలోని గిరిజన ఆవాసాలను ముంచెత్తిన వరదలు గరిష్ఠ స్థాయిలో పోలవరం ప్రాజెక్టు కింద చోటుచేసుకునే స్థాయి ముంపును సృష్టించాయి. 2020 నుంచి ఈ పరిస్థితులు ఎదురవుతున్నా వరద ముంపును నిరోధించే శాశ్వత చర్యలు కొరవడుతున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఐదు మండలాల్లో పోలవరం ప్రాజెక్టు కింద 236 ఆవాసాలు ముంపునకు గురవుతుండగా 67,503 కుటుంబాల వారు నిర్వాసితులుగా ఉన్నారు. మొదటి దశలో 101 ఆవాసాలు ముంపునకు గురవుతున్నాయి. వీటిలో దేవీపట్నం మండలంలోని 46 ఆవాసాలు ఇప్పటికే ఖాళీ అయ్యాయి. ఇక నాలుగు విలీన మండలాల్లోని 190 ఆవాసాల్లో పునరావాసం అమలుకావాల్సి ఉంది. కాగా పోలవరం ప్రాజెక్టు పూర్తి కాకుండానే వరదలు ఈ ఆవాసాలకు పోలవరం ప్రాజెక్టు ముంపు కష్టాల్ని రుచి చూపిస్తున్నాయి. 2020 నుంచి తాజా వరదల వరకు నాలుగు విలీన మండలాల్లో 134 ఆవాసాలు తరచూ ముంపును ఎదుర్కొంటున్నాయి. 1986నాటి తీవ్ర వరదలను లెక్కచేయని విలీన మండలాల గ్రామాలను పోలవరం కాఫర్‌డ్యామ్‌తో ముంపు తీవ్రత పెరిగి వరదలు కలవరపెడుతున్నాయి. గతంలో పోలవరం వద్ద 14 మీటర్ల స్థాయిలోనే గోదావరి ధవళేశ్వరం ఆనకట్టవైపు సులభంగా వెళ్లిపోయేది. ఇప్పుడు 40 మీటర్లు మించితేగానీ వెళ్లని పరిస్థితి కాఫర్ డ్యామ్, పోలవరం స్పిల్‌వే కారణంగా నెలకొంది. ఏ స్థాయిలో ఎన్ని క్యూసెక్కుల నీరు కిందకు వెళ్తుందో ఇంజనీర్లు ఇప్పటికే పేర్కొన్నారు. ఇటీవల పోలవరం కాఫర్ డ్యామ్ వద్ద నీటిమట్టం సుమారు 35 మీటర్ల వరకూ వెళ్లింది. ఈ స్థాయికి మించి 41.15 మీటర్ల స్థాయిలో మొదటి దశగా పోలవరం ప్రాజెక్టు కింద నీటిని నిల్వచేసినా విలీన మండలాల్లో 60 ఆవాసాలు మాత్రమే ప్రభావానికి లోను కావాల్సి ఉండగా వరదలు 134 ఆవాసాలను ముంచుతున్నాయి. ఇది ఏకంగా పోలవరం ముంపు లెక్కలనే తప్పుబట్టేలా ఉంది. 2019, 2020 వరదల్లో అసంపూర్ణంగా ఉన్న కాఫర్ డ్యామ్ కారణంగానే వరద తీవ్రత పోలవరం గరిష్ఠ స్థాయి... అంటే 45.72 మీటర్లలో మునిగే గ్రామాలు వరదల్లో చిక్కుకున్నాయని చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి 2021లో ప్రభుత్వానికి ఇచ్చిన ఒక నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. తరచుగా వచ్చే వరదల నుంచి విలీన మండలాల్లోని గ్రామాలను కాపాడాలంటే నిర్వాసితులకు పునరావాస కాలనీలను తక్షణం నిర్మించాలని పరోక్షంగా సూచించారు. ఈ ముంపు గ్రామాల కోసం 110 కాలనీలను పూర్తి చేయాల్సి ఉంది. అయితే గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం విలీన మండలాల కోసం ఒక్క కాలనీని పూర్తి చేయలేదు. కూటమి ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకుని న్యాయం చేస్తుందని విలీన మండలాల ప్రజలు ఆశిస్తున్నారు.

బొమ్మూరు డైట్ కళాశాలలో అరాచకం

- విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- కలెక్టర్ ఆదేశాలతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పీడీ విచారణ
- ఇద్దరు అధ్యాపకుల సస్పెండ్?
- ఇద్దరు సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు
- అమరావతిలో రిపోర్ట్ చేయాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశాలు

రాజమహేంద్రవరంరూరల్/సిటీ, జూలై31: బొమ్మూరు డైట్ కళాశాలలో లైగింక వేధింపుల పట్ల విచారణ జరిపి ఇద్దరు అధ్యాపకులను సస్పెండ్ చేసినట్టు తెలిసింది. తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) కళాశాలలో తెలుగు అధ్యాపకుడు బాలరాజు, పీఈటీ వీరభద్రరావు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు సుమారు 15 రోజుల కిందట డీఎడ్ కోర్సు చదువుతున్న విద్యార్థినులు ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. కళాశాలలో ఇద్దరు అధ్యాపకులు, మరికొంతమంది నాన్‌టీచింగ్ స్టాఫ్ కలిసి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్టు విద్యార్థినులు ఫిర్యాదు పేర్కొన్నారు. ఈ విషయాన్ని డైట్ క్యాంపస్‌లోనే బయటపెట్టాలని ప్రయత్నించినా కొంతమంది నాన్‌టీచింగ్ స్టాఫ్ భయపెట్టడంతో వెనక్కి తగ్గినట్టు తెలిసింది. దీంతో విద్యార్థినులు ఎవరికి తెలియకుండా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం విచారణకు ఆదేశించారు. ఈ మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, ఐసీడీఎస్ పీడీ విజయకుమారి కళాశాలలో విచారణ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి జరిగిన వాస్తవాలు తెలుసుకున్నారు. కళాశాలలో జరిగిన చాలా విషయాలు బయటకు వచ్చాయి. లైంగిక వేధింపులతోపాటు భవన నిర్మాణాల్లో అక్రమాలు, దోపిడీ, నాన్‌టీచింగ్ స్టాఫ్‌లో ఇద్దరు కింది స్థాయి ఉద్యోగుల అరాచకాలు, విద్యార్థినుల నుంచి అదనంగా ఫీజుల పేరుతో వసూళ్లు, మౌలిక సదుపాయాల లేమి వంటి అంశాలు బయటకు వచ్చాయి. ఆయా అంశాలపై విచారణ కొనసాగించారు. నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను విచారించారు. కళాశాల ప్రిన్సిపాల్ జయశ్రీకి ఫిర్యాదుచేసినా పట్టించుకోకపోవడంతో ఉన్నతాధికారులను ఆశ్రయించినట్టు విద్యార్థినులు తెలిపారు. కళాశాలలోని ఇద్దరు అటెండర్లు ప్రిన్సిపాల్‌నే బెదిరింపులకు గురిచేసిన సంఘటనలు జరిగినట్టు తెలిసింది. విచారణలో భాగంగా తెలుగు అధ్యాపకుడు బాలరాజు, పీఈటీ వీరభద్రరావుల తీరుపై విచారణ అధికారిణి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ప్రిన్సిపాల్ జయశ్రీ ఈ ఏడాది ఏప్రిల్‌లో కళాశాలకు ప్రిన్సిపల్‌గా వచ్చారు. విద్యార్థినులపై లైగింక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో అమరావతిలో రిపోర్టు చేయాలని కలెక్టర్ ఆదేశించినట్టు తెలిసింది. మరొక ఇద్దరు నాన్‌టీచింగ్ స్టాఫ్‌పై శాఖాపరమైన చర్యలకు ఆదేశాల్చినట్టు తెలిసింది. కళాశాలలో సరైన పర్యవేక్షణలేకపోవడం, భద్రత లేకపోవడం, అటెండర్లు నిబంధనలు పాటించకపోవడం విచారణ అధికారికి ఆశ్చర్యం కలిగించాయి. కళాశాలలో రూ.80 లక్షలతో చేపట్టిన నాడు-నేడు పనుల రికార్డులను తనిఖీ చేసి చేపట్టిన పనులు పరిశీలించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు.

రుణాల పేరుతో భారీగా సొమ్ములు స్వాహా

- వెలుగులోకి వస్తున్న యానిమేటర్ అక్రమాలు
- మరోమారు డీఆర్డీఏ అధికారుల విచారణ



పిఠాపురం మండలం బి.కొత్తూరులో విచారణ నిర్వహిస్తున్న డీఆర్డీఏ అధికారులు

పిఠాపురం రూరల్, జూలై 31: రుణాల పేరుతో యానిమేటర్ భారీగా సొమ్ములు స్వాహా చేసినట్టు వచ్చిన ఆరోపణలపై డీఆర్డీఏ అధికారులు విచారణ చేపట్టారు. మహిళా సంఘాల సభ్యుల పేరు మీద రూ.4 కోట్లు మేర రుణాలు తీసుకుని యానిమేటర్ పక్కదారి పట్టించినట్టు వెల్లడైంది. పిఠాపురం మండలం బి.కొత్తూరు గ్రామంలోని మహిళా శక్తి సంఘాల సభ్యుల పేరుపై పిఠాపురానికి చెందిన యానిమేటర్ పద్మకుమారి రుణాలు తీసుకుని వాటిని చెల్లించకపోవడంతో ఏడు బ్యాంకుల నుంచి మహిళలకు నోటీసులు అందాయి. దీనిపై వారు తాము రుణాలు తీసుకోకుండా నోటీసులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. ఇప్పటికే ఒకసారి విచారణ నిర్వహించిన అధికారులు బుధవారం మరోమారు విచారణ చేపట్టారు. డీఆర్డీఏ డీపీఎం వి.పద్మావతి, ఏపీఎం ప్రియదర్శిని, పిఠాపురం బ్యాంక్ ఆఫ్ బరోడా, డీసీసీబీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, ఐవోబీ, విరవాడ, పిఠాపురం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అధికారులు 184 మంది మహిళలను విచారించారు. తాము ఒక్క రుణం మాత్రమే తీసుకున్నామని, మూడు, నాలుగు రుణాలు తీసుకోలేదని 40 మందికి పైగా మహిళలు చెప్పారు. యానిమేటర్ తీసుకున్న రుణాలు రూ.4కోట్లుపైగా ఉన్నాయని గుర్తించారు. యానిమేటర్ తమ పేరుపై ఎన్ని రుణాలు తీసుకుందో తెలియజేయాలని మహిళలు డిమాండ్ చేశారు. లెక్కలు తర్వాత చెప్తామంటూ అధికారులు వెళ్లిపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణలో ఎల్‌సీలు రమేష్, రామకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.





రావులపాలెంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు, కేవీ, ఆకుల.. విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆనం

అన్ని ఆలయాల అభివృద్ధికి కృషి

దేవదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రావులపాలెం, జూలై 31: 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమం, అభివృద్ధి ఏవిధంగా చేయాలన్న అంశంపై ముందుకు వెళ్తోంది.. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని నరేంద్రమోదీ, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సహకారాలతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు బాటలు వేస్తున్నారని' దేవదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. రావులపాలెంలోని మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి స్వగృహానికి బుధవారం రాత్రి ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, అయితాబత్తుల ఆనందరావు, నాయకులు కేవీ, ఆకుల రామకృష్ణ, బండారు సంజీవ్‌లు ఆయనకు ఘనస్వాగతం పలికి ఆయనను సత్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను అభివృద్ధిపరిచేందుకు కృషిచేస్తామన్నారు. అర్చకులకు సరైన విధానం లేదు, వారు నిత్యపూజలు చేయడానికే ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో 5400పైబడి దేవాలయాలకు దూపదీప నైవేద్యాలకు నగదు అందిస్తున్నాం. ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం రూ.10 వేలు ఇస్తామని ప్రకటించాం. దేవదాయశాఖపై రూ.32 కోట్లు అదనపు భారం పడుతునప్పటికీ ఇవ్వడానికే కట్టుబడి ఉన్నామన్నారు. రూ.50 వేలు ఉన్న దేవాలయాల్లో ఉన్న అర్చకులకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు అందించడం జరుగుతుందన్నారు. ఆలయాలకు పాలకవర్గ సభ్యులను, అధికారులను నియమించడం జరుగుతుందన్నారు. ఆలయాల ప్రక్షాళన మొదలుపెడతామన్నారు. టీటీడీలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఓ వ్యక్తి పరకామణిలో తొమ్మిది అమెరికన్ డాలర్లు దోచుకుంటే ఆ వ్యక్తిని పట్టుకుని కేసు పెట్టడం జరిగిందని, 72వేల విలువైన నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అయితే ఆ వ్యక్తి పశ్చాత్తాపపడి రూ.14.50 కోట్లు టీటీడీ దేవస్థానానికి ఇస్తానని చెప్పడం జరిగిందన్నారు. దీన్నిబట్టి చూస్తే వైసీపీ పాలనలో ఎన్ని కోట్లు మేర దోపిడీ జరిగిందో తేటతెల్లమైందన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపడతామన్నారు. ఉమ్మడి రాష్ట్రం విడిపోయినప్పటి నష్టం కన్నా వైసీపీ పాలన అధిక నష్టం రాష్ట్రానికి చేకూర్చిందన్నారు. దాదాపు 58 వ్యవస్థలు, డిపార్టుమెంట్లు గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్వీర్యం అయిపోయాయన్నారు. నాయకులు చిలువూరి సతీష్‌రాజు, గుత్తుల పట్టాభిరామారావు, కొవ్వూరి జగన్నాధరెడ్డి, చిన్న కేవీ, వెలగల శ్రీనివాసరెడ్డి, జక్కంపూడి వెంకటస్వామి, కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మైమరిచేలా..

ఏజెన్సీ అందాలను ఎంతసేపు చూసినా తనివితీరదు. మన్యం అంతటా కొద్దిరోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షం కొంతసేపు పడి తెరిపిచ్చాక.. ఆ సమయంలో కొండల్లోంచి కనిపించే పొగమంచు అందాలు స్థానికులను, పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. చింతూరు మండలం మోతుగూడెం సమీపంలోని సుకుమామిడి వద్ద బుధవారం ఇలా పొగమంచు అందాలు మైమరిపించాయి. - మోతుగూడెం



రాజమహేంద్రవరం మార్కెండేయస్వామి గుడి వద్ద టీటీడీ ఘాట్‌లో వరద ఉధృతి

నిలకడగా గోదారి

- 10.41 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
- కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

ధవళేశ్వరం,జూలై31: ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. బుధవారం తెల్లవారుజామున 4గంటలకు 12.10 అడుగుల వరకు తగ్గిన నీటిమట్టం ఆపై 1 5గంటలుగా నిలకడగా కొనసాగుతోంది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 10, 41,489 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. రాత్రి 8 గంటలకు నీటిమట్టం నిలకడగా 12.10 అడుగుల వద్ద ఉంది. ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద ప్రవాహంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం తగ్గకుండా నిలకడగా ఉంది. గురువారం ఉదయం వరకు నీటిమట్టం నిలకడగా కొనసాగి తగ్గుముఖం పట్టవచ్చని ఆపై గంటల వ్యవధిలోనే మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించే స్థాయికి నీటిమట్టం తగ్గుతుందని అధికారులు అంచనా. కాగా ఎగువన భద్రాచలం వద్ద మంగళవారం అర్ధరాత్రి వరకు పెరిగిన నీటిమట్టం 45.10 అడుగుల వరకు చేరుకుని కొద్ది గంటలు నిలకడగా ఉండి ఆపై తగ్గుముఖం పడుతుంది. బుధవారం రాత్రి 8గంటలకు నీటి 44.70అడుగులుగా నమోదైంది. కాగా ఎగువ ప్రాంతాల్లో నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. బుధవారం సాయంత్రానికి కాళేశ్వరం వద్ద 9.85 మీటర్లుగా నీటిమట్టం నమోదుకాగా, పేరూరు వద్ద 15.48 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 12.17 మీటర్లు, భద్రాచలం వద్ద 44.70 అడుగులు, కూనవరం వద్ద 19.06మీటర్లు, కుంట వద్ద 10.37మీటర్లు, పోలవరం వద్ద 12.36 మీటర్లు, రాజమండ్రి రైల్వే బ్రిడ్జి వద్ద 16.12మీటర్లుగా నీటి మట్టం నమోదైంది.



సైకిల్‌తో సోకులేరు వాగు దాటుతున్న లక్కగూడెం గ్రామస్తుడు జోగయ్య

ప్రాణాలతో చెలగాటం

సోకులేరు వాగులో రాకపోకలు

మోతుగూడెం, జూలై 31: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న చదలవాడ పంచాయతీ సోకులేరు వాగు పదిరోజులుగా కురుస్తున్న వర్షాలు పొంగి బుధవారం కాస్త తగ్గింది. దాంతో మిట్టవాడ, చౌయులూరు, లక్కగూడెం, చదలవాడ గ్రామ ప్రజలు నిత్యావసర సరుకులు, వైద్యానికి సోకులేరు వాగు దాటారు. బుధవారం చింతూరు సంతకు వచ్చి అవసరమైన నిత్యావసర సరుకులను, ఆహార పదార్థాలను కొనుగోలు చేసుకుని తిరిగి సాయంత్రానికి తమ స్వగ్రామానికి వెళ్లారు. నిండుగా ప్రవహిస్తున్న ఏరులో రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదం గుప్పెట్లో సాహసయాత్రలా ఉంటోంది. లక్కవరం గ్రామస్తుడు కలుముల జోగయ్య అనే వ్యక్తి చింతూరు సంతకు వెళ్లేందుకు సోకులేరు వాగులో ఏకంగా తన సైకిల్‌ను భుజంపై పెట్టుకుని వాగు దాటారు. ప్రతిసారి ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని ఏరు దాటుతున్నామని, అసంపూర్తిగా నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేయాలని వారంతా కోరుతున్నారు.



ఏజెన్సీ వరద ప్రాంతాల పర్యటనలో కలెక్టర్ దినేష్, ఎమ్మెల్యే శిరీష

అన్నీ తానై..

- వరద సహాయ చర్యల్లో 10 రోజులపైగా చింతూరులోనే కలెక్టర్
- మండలానికో ఐఏఎస్ ద్వారా సేవలు నిరంతరం సేవలు
- వరద సాయంగా రూ.15.29 కోట్లతో ప్రతిపాదనలు
- ఒక్కరోజులోనే రూ.10 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

రంపచోడవరం/చింతూరు, జూలై31: ఒకటి రెండూ కాదు.. ఏకంగా పది రోజులకు పైగానే సాక్షాత్తూ అల్లూరి జిల్లా కలెక్టర్ మూరుమూల ఏజెన్సీ మండలా ల్లో ఉండిపోయారు. గోదావరి వరద సహాయక కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొని బాధితులకు బాసటగా నిలిచారు. ఆయనే అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్. గోదావరి పరీవాహక ప్రాంతంలోని నాలుగు విలీన మండలాల్లో వరద ముంచెత్తింది. రెండు వారాలపాటు వరద ముంపుతో ఏజెన్సీ ప్రజలు నానా కష్టాలుపడ్డారు. చింతూరులోనే కలెక్టర్ నివాసం ఉండి వరద సహాయక చర్యల్లో పదిరోజులకుపైగానే పాల్గొన్నారు. ఒకపక్క వరద సహాయ చర్యల్లో పాల్గొంటూనే పాడేరు కేంద్రంగా నిర్వర్తించాల్సిన కలెక్టరు విధులను చింతూరు నుంచే నిర్వర్తిస్తూ ప్రభుత్వాన్ని సంధానపర్చుతూ నిర్వాసితులకు భరోసా కల్పించారు. వరరామచంద్రపురం, కూనవరం, చింతూరు, ఎటపాక మండలాల్లోని 191 ఆవాసాల్లోని 35 వేలమంది వరదల ప్రభావానికి గురయ్యారు. ప్రతి మండలానికి ఒక ఐఏఎస్ అధికారిని, ఒక స్పెషల్ డిప్యూటీ కలెక్టరు చొప్పున నాలుగు మండలాలకు నియమించారు. ప్రతి మండలంలో సాధ్యమైనంతవరకూ ప్రతి వరద ప్రభావిత గ్రామాన్నీ సందర్శించి, అక్కడి నిర్వాసితుల గోడు విన్నారు. ప్రతిరోజూ ప్రభుత్వానికి ఇక్కడి పరిస్థితులను నివేదించడం ద్వారా యంత్రాంగాన్ని అప్రమత్తంచేశారు. సోమవారం ఆయన రూ.15.29 కోట్ల మేర నిధులు అవసరమని సమగ్ర నివేదిక పంపించడంతో ప్రభుత్వం మంగళవారం సాయంత్రం ఉత్తర్వులను జారీచేస్తూ తక్షణ సహాయంగా రూ.10 కోట్లను విడుదల చేసింది. నాలుగు మండలాల్లో వరద సహాయంపై నిర్వాసితుల్లో అసంతృప్తికి తావులేకుండా జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఎక్కడికక్కడ ఆయా సమస్యల పరిష్కారం కోసం భరోసా కల్పించారు.



మిర్తిపాడు వేగుళ్ళమ్మ అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

అమ్మవారికి సారె సమర్పణ

సీతానగరం, జూలై 31: సీతానగరం మండలం, మిర్తిపాడు గ్రామంలోని గ్రామదేవత శ్రీ వేగుళ్ళమ్మ అమ్మవారికి మహిళలు సారె సమర్పించారు. ఆషాఢమాసం సందర్భంగా బుధవారం వేగుళ్ళమ్మ అమ్మవారికి సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అలయ కమిటీ సహకారంతో మహిళలు అమ్మవారికి పూజలు నిర్వహించి 101 రకాల పిండి వంటలతో సారె సమర్పించారు.

లోకేశ్ ఓఎస్డీగా ఆకుల

గతంలో చింతూరు ఐటీడీఏ పీవో



చింతూరు, జూలై 31: వైఎస్ఆర్ జిల్లా బద్వేలు ఆర్డీవో ఆకుల వెంకటరమణను రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ కమ్యూనికేషన్ల శాఖల మంత్రి నారా లోకేశ్‌కు ఓఎస్డీగా నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆకుల వెంకటరమణ 2019 అక్టోబరు 10 నుంచి నుంచి 2022 జనవరి 29 వరకు చింతూరు ఐటీడీఏ పీవో కం ఆర్డీవోగా బాధ్యతలు నిర్వర్తించారు. తర్వాత బద్వేలు ఆర్డీవోగా అప్పటి ప్రభుత్వం బదిలీ చేసింది. ప్రకాశం జిల్లా మార్కాపురంనకు చెందిన ఆకుల తన తల్లిదండ్రులైన శ్రీరాములు, లక్ష్మినరసమ్మల పేరిట మెమోరియల్ ట్రస్టు ప్రారంభించి యువతకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేస్తూ వస్తున్నారు.



మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంటి వద్ద ఘర్షణ పడుతున్న యువకుడు

పెద్దాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్‌పై దాడికి యత్నం

పెద్దాపురం, జూలై31: పెద్దాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారుపై బుధవారం ఓ యువకుడు దాడికి యత్నించాడు. స్థానిక వరహాలయ్యపేటలో నివసిస్తున్న ఛైర్‌పర్సన్ కుటుంబానికి అదే ప్రాంతంలో నివసిస్తున్న యువకుడు తానారి సోమరాజు కుటుంబానికి కుటుంబ విషయాలకు సంబంధించి వివాదాలు జరుగుతున్నాయి. కౌన్సిల్ సమావేశం ముగించుకుని ఇంటికి వెళ్లిన ఛైర్‌పర్సన్ ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకున్న సోమరాజు మద్యం సేవించి ఛైర్‌పర్సన్ ఇంటి వెళ్లి తలుపులు బద్దలు కొట్టేందుకు ప్రయత్నం చేశాడు. ఆమెను దుర్భాషలాడుతూ హంగామా సృష్టించాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో సమీపంలో ఉన్నవారు వచ్చి యువకుడిని నిలువరించే ప్రయత్నం చేశారు. దీంతో ఆ యువకుడు దాడికి ప్రయత్నం చేయడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై వెలుగుల సురేష్ అక్కడికి చేరుకుని ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలిసిన వెంటనే వైసీపీ పెద్దాపురం నియోజకవర్గ కోఆర్డీనేటర్ దవులూరి దొరబాబు, వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు అక్కడకు చేరుకుని ఆమెకు అండగా నిలిచారు. ఛైర్‌పర్సన్‌పై దాడిని ఖండించారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



ఏలేశ్వరం, జూలై 31: కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలో సి.రాయవరం గ్రామంలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందాడు. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గజ్జి అప్పన్న (60) ఊట గుంటలో మృతిచెంది ఉండగా స్థానికులు గుర్తించారు. మృతదేహంపై గాయాలు ఉండడంతో పలువురు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు.

'ఎరువుల నియంత్రణ చట్టం సమర్థంగా అమలు'

రాజమహేంద్రవరంరూరల్, జూలై 31: కేంద్రప్రభుత్వ ఎరువుల నియంత్రణ చట్టాన్ని సమర్థవంతంగా అమలుచేయడం ద్వారా నకిలీ ఎరువులు, పురుగుమందులను నియంత్రించవచ్చని భారత ప్రభుత్వ రాష్ట్రీయ ఎరువుల నియంత్రణ ప్రయోగశాల ఉపసంచాలకులు అరుణ్ అన్నారు. రాజమహేంద్రవరంలో మూడు రోజులపాటు 13 జిల్లాల మండల వ్యవసాయాధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులకు నిర్వహించే శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన అరుణ్ మాట్లాడుతూ మండలంలో ఎరువులు, పురుగుమందుల దుకాణాలను నిత్యం పర్యవేక్షించి రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అందేలా వ్యవసాయ అధికారులు కృషి చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు కృష్ణదాసు, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు కైకలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు గంగాధర్ మాట్లాడారు.

బాల దివ్యాంగులకు చేయూతనివ్వాలి : పీడీజే

రాజమహేంద్రవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాల వల్ల హక్కులను పొందకుండా ఉన్న బాల దివ్యాంగులకు సంబంధిత శాఖలు చేయూత ఇవ్వాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. బాల దివ్యాంగుల హక్కుల పరిరక్షణపై వివిధ శాఖల ప్రభుత్వాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బాల దివ్యాంగులు విద్య, వైద్యం వంటి వాటికి దూరం కాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు, 3వ, 7వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌లు రమ్య, పి.బాబు, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కర్రి రామారెడ్డి పాల్గొన్నారు.

ప్రాజెక్టు ఫెలోల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 31 : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రూసా నిధులతో నిర్వహించబడుతున్న పరిశోధనా ప్రాజెక్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భౌతికశాస్త్రం, భూ విజ్ఞానశాస్త్రం విభాగాల్లో ఒక్కొక్కటి చొప్పున ప్రాజెక్టు ఫెలోల నియామకానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆసక్తి, అర్హత కల్గిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆగస్టు 5వ తేదీలోగా ఆన్‌లైన్‌లో సమర్పించాలని కోరారు. అదేవిధంగా దరఖాస్తు నమూనా, మరిన్ని వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌లో సందర్శించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

'బాధ్యతగా పనిచేసే ఉద్యోగులకు చిరకాల గుర్తింపు'

అల్లవరం, జూలై 31: విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు చిరకాల గుర్తింపు లభిస్తుందని అల్లవరం తహసీల్దారు పి.సునీల్‌కుమార్, ఎంపీడీవో కృష్ణమోహన్, అయినవిల్లి జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్ అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన కొమరగిరిపట్నం వీఆర్వో పెనుమాల వెంకటేశ్వరరావు సన్మాన సభకు తహసీల్దారు సునీల్‌కుమార్ అధ్యక్షత వహించారు. వీఆర్వోగా చేసిన వెంకటేశ్వరరావు సేవలను పలువురు వక్తలు కొనియాడారు. వెంకటేశ్వరరావు-విజయనిర్మల దంపతులను సత్కరించారు. విశ్రాంత తహసీల్దార్లు ఎస్.అప్పారావు, పాము సుబ్బారావు, వడ్డి సత్యవతి, ఏఎంసీ మాజీ చైర్మన్ గునిశెట్టి చినబాబు, టీడీపీ నాయకుడు దాట్ల గోపిరాజు, కడలి రామకృష్ణశెట్టి, యు.చిట్టిబాబు, ఏవో ఎన్వీవీ సత్యనారాయణ, గిడుగు సూరిబాబు, ఆర్ఐ ఎం.దుర్గాశ్రీనివాస్, ఇంటి హరిప్రసాద్, దంగేటి వీరరాఘవులు, లంక అమ్మాజీ, ఇసుకపల్లి సత్యనారాయణ, ముంగడ శివార్జునరావు పాల్గొన్నారు.

నూతన మంత్రికి శాఖల కేటాయింపు

యానాం: పుదుచ్చేరి నూతన మంత్రిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పీఆర్ఎస్ తిరుమురుగన్‌కు శాఖలు కేటాయిస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనకు పౌరసరఫరాలతో పాటు పాటు హౌసింగ్, ఆర్ట్ అండ్ కల్చరల్, ఎకనామిక్స్, స్టాటస్టిక్స్ శాఖలు కేటాయించారు.

వరద ముంపు పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

సర్పంచ్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

అమలాపురం రూరల్, జూలై 31: గోదావరి వరదల సమయంలో ముంపు బారిన పడ్డ గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టడం ఆర్థికంగా భారంగా మారిందని పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని బోడసకుర్రు సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో పలువురు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ముంపు గ్రామాల్లోపారిశుధ్య పనులు చేసేందుకు అధికంగా నిధులు ఖర్చు అవుతున్నాయని, పంచాయతీల వద్ద అంతంతమాత్రంగానే నిధులు అందుబాటులో ఉండడం వల్ల ఇబ్బంది పడుతున్నామని వివరించారు. వరదల సమయంలో పంచాయతీలపై ఆర్థిక భారం పడకుండా శానిటేషన్‌కు అవసరమైన పబ్లిక్ హెల్త్ మెటీరియల్‌ను ప్రభుత్వమే అందించాలని లేకుంటే ప్రత్యేక నిధులను పంచాయతీలకు కేటాయించాలని కోరారు. ముంపు ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టేందుకు వీలుగా ఇతర ప్రాంతాల సిబ్బందిని డిప్యుటేషన్‌పై నియమించాలని కోరారు. పేరూరులో జరుగుతున్న పారిశుధ్య పనులను అమలాపురం డీఎల్పీవో పి.బొజ్జిరాజు పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ దాసరి అరుణ, కార్యదర్శి రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, దాసరి డేవిడ్, దారా రామకృష్ణ, ఎంపీటీసీలు వున్నారు.



పేరూరులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్పీవో బొజ్జిరాజు



విద్యామిత్ర కిట్‌ల పంపిణీ

అమలాపురం రూరల్, జూలై 31: బండారులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్‌లను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పంపిణీ చేశారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పెనుమాల సునీత, బళ్ల వెంకటేశ్వరరావు, కాశిన బాబి, బళ్ల వీర్రాజు, బళ్ల శ్రీనివాసచక్రవర్తి, మల్లుల పోలయ్య, మంద గెద్దయ్య, మాడా మాధవి, కొల్లి అంబేడ్కర్, ఉందుర్తి జీవరత్నం, బట్టు పండు, కాశిన ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు. పాఠశాల తెలుగు పండిట్ శ్రీకృష్ణావధానుల రామకృష్ణశాస్త్రి పదవీ విరమణ చేయడంతో ఎమ్మెల్యే ఆనందరావుతో పాటు గ్రామస్తులు సత్కరించారు.



వరద బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

'వరద బాధితులను పూర్తిస్థాయిలో ఆదుకుంటాం'

పి.గన్నవరం, జూలై 31: వరద బాధిత కుటుంబాలను పూర్తిస్థాయిలో ఆదుకుంటామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబుతో కలిసి కె.ఏనుగుపల్లిలో వరద బాధితులకు నిత్యావసరాలను అందించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ సహ కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, మండల శాఖ అధ్యక్షుడు తోలేటి సత్తిబాబు, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, శేరు శ్రీనుబాబు, బొరుసు సత్యనారాయణ, ఉండ్రాజవరపు ప్రసాద్, తెలగాని కనకరాజు, బొణం దొరబాబు, తోలేటి శ్రీరామమూర్తి, పుచ్చకాయల సత్యనారాయణ, గుడాల సంపదరావు, తోలేటి త్రిమూర్తులు, తోలేటి తాతాజీ, నిమ్మకాయల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న రవిశర్మ

పురోహిత సమాఖ్య రాష్ట్ర అధికార ప్రతినిధిగా

రవిప్రసాద్ శర్మ

ఐ.పోలవరం, జూలై 31: పురోహిత సమాఖ్య రాష్ట్ర అధికార ప్రతినిధిగా మండలంలోని మురమళ్లకు చెందిన నాగాభట్ల రవిప్రసాద్ శర్మ మూడోసారి నియమితులయ్యారు. బుధవారం విశాఖపట్నంలోని శిల్పారామంలో రాష్ట్ర పురోహిత బ్రాహ్మణ సమాఖ్య సమావేశం జరిగింది. జిల్లా, రాష్ట్ర కమిటీలు ఏర్పాటయ్యాయి. పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కుల వృత్తిగా గుర్తించాలని సూచించారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు యామిజాల నరసింహమూర్తి, అధ్యక్షుడు పోదిల నారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి దుర్గబాబు నుంచి రవిశర్మ నియామక పత్రం అందుకున్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

కొత్తపేట, జూలై 31: 18 ఏళ్లు నిండిన ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, లీగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూజింగ్ హెల్మెట్స్, వైల్డ్ డ్రైవింగ్ టూ వీలర్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఏ.ప్రభాకరరావు, బాలప్రతాప్, డీసీహెచ్ పాపారావు, ఎం.సూర్య ఎన్.భవాని పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

కొత్తపేట, జూలై 31: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు సేవా మందిరం వద్ద ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని బుధవారం ట్రస్టు సభ్యుడు కంకటాల సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే సత్యసాయి సేవా సమితి ద్వారా ప్రతి నెల ఒక రోజు ప్రముఖ వైద్యులు సత్యవరపు గాంధీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మన్యం వర్ధనరావు, లక్ష్మణరావు, కొండబాబు, వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల పౌష్టికాహారంపై అవగాహన

మలికిపురం, జూలై 31: మలికిపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పిల్లలకు పౌష్టికాహారంపై డాక్టర్ అలేఖ్య బుధవారం అవగాహన కల్పించారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే తల్లిపాలు ఎంతో ముఖ్యమన్నారు. తల్లిదండ్రులు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. డాక్టర్ రాపాక రమేష్‌బాబు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బత్తుల ఝాన్సీబాయి, కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ఆపరేషన్ రావణ
శ్రీలలిత	: పురుషోత్తముడు
శేఖర్ స్ర్కీన్-1	: డార్లింగ్
శేఖర్ స్ర్కీన్-2	: డెడ్ పూల్
రమా	: రాయన్
గణపతి	: హరోం హర
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: కల్కి
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: డెడ్ పూల్

మాస్టర్‌ప్లాన్ ప్రకారం వెంకన్న ఆలయ అభివృద్ధి

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, జూలై 31: రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ ప్రకారం చర్యలు చేపడతామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పుష్కరిణి, వకుళ



అన్నప్రసాద భవన డిజైన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

మాత అన్నప్రసాద భవనం నిర్మాణం, పార్కింగ్ ప్రదేశాలు, వివిధ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తుల రద్దీ రోజురోజుకూ పెరిగిపోతోందని, ఆ దిశగా సౌకర్యాల కల్పనకు పూర్తిస్థాయిలో చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్ వద్ద, వాడపల్లి వంతెన వద్ద, బొబ్బర్లంక వద్ద ముఖ ద్వారాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కాలినడకన వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాల కోసం డార్మిటరీలు, మరుగుదొడ్లు, భక్తులు వేచి ఉండే క్యూకాంప్లెక్స్ పార్కింగ్ ప్రాంగణాలను తీర్చిదిద్దడం వంటి పనులను సత్వరమే చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. కోట్లాది రూపాయలతో నిర్మించే పుష్కరిణి, వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణం పనులకు సంబంధించి ఏ దశలో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. కల్యాణ మండపాలు, పరిపాలన భవనం, విశ్రాంతి గదులు, నిర్మాణాలకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు ముళ్లపూడి భాస్కరరావు, కరుటూరి నరసింహరావు, కాయల జగన్నాథం, వెత్సా అనిల్, బండారు బాబి, ఏపుగంటి వెంకటేష్, ఉప కమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

రూ 4.28 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

రామచంద్రపురం కౌన్సిల్ అత్యవసర సమావేశం

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూలై 31: రామచంద్రపురం పట్టణంలో రూ.4.28 కోట్ల జనరల్ ఫండ్స్‌తో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రామచంద్రపురం మున్సిపల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. కౌన్సిల్ అత్యవసర సమావేశం ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన బుధవారం జరిగింది. మంత్రి వాసంశెట్టి సుభాష్, ఛైర్‌పర్సన్ శ్రీదేవి సూచనలతో కొన్ని వార్డుల్లో సాధారణ నిధులతో సీసీ డ్రైన్లు, రోడ్ల నిర్మాణానికి అంచనాలు తయారు చేసి ఎజెండాలో పొందుపరిచారు. తాగునీటి విభాగంలో ఐదుగురు సిబ్బంది, పబ్లిక్ హెల్త్‌విభాగంలో ముగ్గురు డ్రైవర్లు కాంట్రాక్టు పద్ధతిలో నియమకానికి ప్రతిపాదించారు. ఈ అంశంపై కౌన్సిలర్ వాడ్రేవు సాయిప్రసాద్ మాట్లాడుతూ 2016లో అప్పటి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా నియామకాలు చేపట్టడానికి కమిషనరుకు అధికారం లేదన్నారు. దీంతో ఈ అంశాన్ని తిరస్కరించారు. పాత బస్టాండులోని మున్సిపల్ షాపింగ్‌లో 11వ షాపును లీజుదారుడు వినియోగించకపోవడం, అద్దె చెల్లించకపోవడంపై సాయిప్రసాద్ మాట్లాడారు. లీజుదారుడు నుంచి అద్దె బకాయిలు వసూలు చేయాలి కానీ అద్దె రద్దు ప్రతిపాదన ఏమిటని ప్రశ్నించారు. ఈ అంశాన్నీ తిరస్కరించారు. మున్సిపల్ షాపుల అద్దె బకాయిలపై కోర్టు ద్వారా చర్యలు చేపట్టేందుకు కోర్టు ఫీజు రూ.1.91 లక్షలు సాధారణ నిధుల నుంచి చెల్లింపు ప్రతిపాదన వాయిదా వేశారు. రెవెన్యూ విభాగంలో ఖాళీగా ఉన్న డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టును అవుట్ సోర్సింగ్ ద్వారా నియమించే అంశాన్ని సీడీఎంఏకు పంపాలని, తదుపరి కౌన్సిల్ ముందుంచాలని వైస్ ఛైర్‌పర్సన్ కొలమూరి శివాజీ, విప్ వాడ్రేవు సాయిప్రసాద్ సూచించారు. తొలుత మున్సిపల్ డీఈ డి.దుర్గాప్రసాద్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళుర్పించింది. సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కమిషనరు బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

'అన్నార్తుల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్'



అమలాపురం టౌన్, జూలై 31: అన్నార్తుల ఆకలి తీర్చేందుకు అధిక ప్రాధాన్యమిస్తూ అన్న క్యాంటీన్ల నిర్మాణానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పారు. పురపాలక సంఘ కార్యాలయానికి సమీపంలో నూతనంగా నిర్మించనున్న అన్న క్యాంటీన్ భవనానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు, నాయకులు, కౌన్సిలర్లు పెచ్చెట్టి విజయలక్ష్మి, యండమూరి గంగ, యేడిద శ్రీను, తిక్కిరెడ్డి నేతాజీ, తిక్కా సత్యలక్ష్మి, బొర్రా చిట్టిబాబు, మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, గండి స్వామి, ఆశెట్టి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు అధ్యక్షతన నిర్వహించిన ప్రివ్యూ సమావేశంలో ఆనందరావు మాట్లాడారు. ఆసుపత్రిలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు, వైద్య సిబ్బంది నియామకానికి చర్యలు చేపడతామని హామీనిచ్చారు. కార్యక్రమంలో పెచ్చెట్టి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలి

రాజోలు, జూలై 31: రాజోలు నియోజకవర్గంలోని అని గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీచట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా దళిత చైతన్య నాయకులు అధికారులను డిమాండు చేశారు. వేగివారిపాలెంలో బుధవారం జరిగిన దళిత చైతన్య వేదిక కార్యవర్గ సమావేశంలో వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతినెలా చివరి వారంలో తహసీల్దారుతో పాటు పాటు మండల స్థాయి అధికారులు గ్రామాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించాలన్నారు. ఎస్సీ వసతిగృహాల్లో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు.రాజోలు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, ఉపాధ్యక్షుడు చిలకపాటి శ్రీధర్, బత్తుల జనార్దనరావు, జిల్లెల్ల వినోద్, తెన్నేటి నాగేశ్వరరావు, చుట్టుగుళ్ల సత్యనారాయణ, కాకర విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం



యానాం, జూలై 31: పుదుచ్చేరి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. పోలీసులు నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఇన్‌చార్జి లెఫ్టినెంట్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు స్పీకర్ సెల్వం పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం అసెంబ్లీనుద్దేశించి గవర్నర్ ప్రసంగించగా మంత్రులు, ఎమ్మెల్యేలు ధన్యవాద తీర్మానం, ఇతర అంశాలపై మాట్లాడారు. పుదుచ్చేరికి నూతన గవర్నర్‌ను కేంద్రం నియమించడంతో ఇన్‌చార్జి గవర్నర్‌కు వీడ్కోలు పలికారు. ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి 2024-25 వార్షిక బడ్జెట్‌ను గురువారం ఉదయం సభలో ప్రవేశపెట్టనున్నారు. మంత్రులతో పాటు యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొన్నారు.

పాడి పరిశ్రమకు పూర్వవైభవం తెచ్చేందుకు కృషి

రావులపాలెం, జూలై 31: పాడి పరిశ్రమకు పూర్వ వైభవం తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం మండలం ఉబలంక శివారు తోకలంక వరద ముంపునకు గురవ్వడంతో పశువులకు మేత కొరత ఏర్పడింది. దీంతో పశు పోషకులకు రెండు టన్నుల పశువుల దాణాను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



రావులపాలెం మండలం ఉబలంక శివారు తోకలంకలో రైతులకు పశువుల దాణా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కపిలేశ్వరపురం: మండలంలోని కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, పల్లపులంక, అద్దంకివారిలంక, గ్రామాల్లోని పాడి రైతులకు బుధవారం 26 టన్నుల టీఎంఆర్ పశు దాణా రైతులకు పంపిణీ చేసినట్టు పశుసంవర్ధక శాఖ ఆలమూరు ఏడీ అనిత తెలిపారు. సర్పంచ్‌లు వీధి వెంకటరెడ్డి, సాకా శ్రీనివాస్, నాతి గవరయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పి.గన్నవరం నాగుల్లంకలో 139 మంది పాడి రైతులకు పశు వైద్య సహాయ సంచాలకులు ఎల్.విజయరెడ్డి, డాక్టర్ కిరణ్‌చైతన్య ఆధ్వర్యంలో పశుదాణా పంపిణీ చేశారు. సర్పంచ్ యల్లమిల్లి కృష్ణవేణి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎ.శరభరాజు, ఏహెచ్ఏలు ఎన్.రాజా, రాంబాబు, సునీత, యల్లమిల్లి చిట్టిబాబు, కారుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆషాఢ సారె తీసుకెళ్తున్న మహిళలు

శాకంబరీ అలంకరణలో రావులమ్మ అమ్మవారు



అంబాజీపేట, జూలై 31: గంగలకుర్రు అగ్రహారం గ్రామ దేవత రావులమ్మ అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. వేకువజామున 108 కలశలతో మహిళలు ఊరేగింపుగా తీసుకువచ్చిన నదీ జలాలు, వివిధ రకాల ద్రవ్యాలతో వేదపండితుడు మండా లక్ష్మీనరసింహమూర్తి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ఆలయ అసాదులు గుమ్మలూరి సూర్యనారాయణ, త్రిమూర్తులు, శేఖర్ వివిధ రకాల పండ్లు, కూరగాయలతో విశేషంగా అలంకరించారు. భక్తులు దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

నిధుల గోల్‌మాల్ ఆరోపణతో యానిమేటర్ తొలగింపు

ఆలమూరు, జూలై 31: డ్వాక్రా సంఘాల నిధులను గోల్‌మాల్ చేసిన ఆరోపణలతో ఆలమూరు-1 డ్వాక్రా యానిమేటర్ శిరోమణిని విధుల నుంచి తొలగించారు. ఆమెపై గత నెలలో జిల్లా అధికారుల సమక్షంలో జరిగిన విచారణలో రూ.3.75 లక్షల నిధులు గోల్‌మాల్ జరిగినట్టు నిర్ధారించి ఆ మేరకు ఆమె ఈ నిధులను తిరిగి చెల్లించడానికి అంగీకరించారు. అయితే డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆలమూరులో బుధవారం ఏపీఎం ధనరాజు, సీసీ భీమరాజు, మండల సమాఖ్య కార్యదర్శి వార దుర్గాదేవి అధ్వర్యంలో మండల సమాఖ్య అత్యవసర సమావేశం నిర్వహించారు. శిరోమణిని తక్షణం విధుల నుంచి తొలగించాలని తీర్మానించడంతో ఆమెను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఏపీఎం ధనరాజు ప్రకటించారు. గోల్‌మాల్ జరిగిన నిధుల చెల్లింపునకు అక్టోబరు వరకు గడువు కోరడంతో ఆ మేరకు పెద్దల సమక్షంలో ఒప్పందం జరిగింది. గడువు లోపు చెల్లించని పక్షంలో యానిమేటర్ శిరోమణిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ధనరాజు వివరించారు. సమావేశంలో నాయకులు ఈదల నల్లబాబు, వంటిపల్లి సతీష్, మానేపల్లి శ్రీనివాస్, శిరిగినీడి పట్టాభి, చల్లా ఏడుకొండలు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

జిల్లా వైద్యాధికారి దుర్గారావుదొర

మామిడికుదురు, జూలై 31: వైద్య ఉద్యోగులందరూ ప్రజలు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావుదొర కోరారు. బుధవారం ఆయన లూటుకుర్రు పీహెచ్‌సీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ఇచ్చిన నెలవారీ టార్గెట్లను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. పీహెచ్‌సీల్లో పాము, కుక్కకాటు వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని తెలిపి వాటిని తనిఖీ చేశారు. అంటువ్యాధులు ప్రబలుతున్న తరుణంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పాశర్లపూడిలంకలోని శ్రీరామపేట వద్ద నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సందర్శించి ప్రజలకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.



వేగుళ్లకు దేవాంగ సంఘ సభ్యుల సత్కారం

మండపేట, జూలై 31: మండపేట నియోజకవర్గం నుంచి తనను నాల్గవ సారి గెలిపించిన వారిలో చేనేత కార్మికుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని అన్నపూర్ణాదేవి ఆలయ ట్రస్టు సభ్యులు, పార్వతీనగర్ దేవాంగ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను బుధవారం ఘనంగా సత్కరించారు. దేవాంగ సంఘీయుల అభ్యున్నతికి తన తన వంతు సహకరిస్తానని ఆయన చెప్పారు.

రైతులు మేలైన పద్ధతులు పాటించాలి

అంబాజీపేట, జూలై 31: రైతులు మేలైన పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఏవీఎస్ రాజశేఖర్ సూచించారు. ఇరుసుమండలో పొలంబడి కార్యక్రమాన్ని ఏవో సీహెచ్‌డీ విజయకుమార్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలైన వ్యవసాయ పద్ధతుల ద్వారా పొలంబడిలో పండించిన పంటలను ధ్రువీకరిస్తామన్నారు. పి.గన్నవరం ఏడీ ఎస్‌జేవీ రామ్మోహనరావు మాట్లాడుతూ సమగ్ర సస్యరక్షణ, ఎరువుల యజమాన్యం ద్వారా మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. విత్తనశుద్ధి, పురుగు మందుల విష ప్రభావంపై రైతులకు బ్యాలెట్ బ్యాక్స్ టెస్ట్ నిర్వహించారు. రైతులు జీవన ఎరువులను వినియోగించి ఆరోగ్యకరమైన పంటలను పండించాలని సూచించారు. జీవామృతంపై అవగాహన కల్పించారు. ఏఈవో డి.దుర్గారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జె.నాగమణి, వీఏఏ, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

అంతర్వేదిలో విద్యాశాఖాధికారుల పూజలు

అంతర్వేది, జూలై 31: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రాష్ట్ర ఫైనాన్స్ కంట్రోలర్ కె.పాలేశ్వరరావు, జిల్లా ఎఫ్ఏవో జి.ప్రవీణ్‌కుమార్ విచ్చేశారు. వారికి అధికారులు, అర్చకులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరంవేద పండితులు మహదాశీర్వచనం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం.వెంకటేశ్వరరావు, అక్కౌంటెంట్ బి.రాజబాబు, క్లస్టర్ రిజర్వుడు మొబైల్ టీచర్ శ్రీనివాస్, సీఆర్పీ కిశోర్ పాల్గొన్నారు.

'అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు ప్రజల్లో గుర్తింపు'

కపిలేశ్వరపురం, జూలై 31: విధి నిర్వహణ పట్ల అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు ప్రజల్లో ఎల్లప్పుడూ మంచి గుర్తింపు లభిస్తుందని జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, సర్పంచ్ సాకా శ్రీనివాస్ అన్నారు. కోరాటి వారి వీధి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బంటుమిల్లి వెంకటేశ్వరరావు బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సన్మాన సభలో వెంకటేశ్వరరావు మాస్టారు సేవలను జడ్పీటీసీ అబ్బు, సర్పంచ్ శ్రీనివాస్, డీవైఈవో శ్రీపాద లక్ష్మీనరసింహ ఫణి, ఎంపీడీవో కొండలరావు, ఎంఈవో కె.తాతారావు కొనియాడారు. హెచ్ఎం దంపతులకు పూలమాలలు, దుశ్శాలువాలు కప్పి మెమెంటోలు అందజేశారు. ఎంపీటీసీలు గొల్లపల్లి సోనియా, శీలం భాస్కరరావు, రిటైర్డ్ ఎంఈవో కేవీ సత్యనారాయణ, ఎన్జీవో సంఘ నాయకులు జుత్తుగ మల్లికార్జునుడు, యూటీఎఫ్ నాయకులు పి.సురేంద్రకుమార్, జె.శ్రీనివాస్, ఐ.సూరిబాబు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, బంధువులు పాల్గొన్నారు.



ఆర్జేడీకి వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

అధ్యాపకుల నియామకంపై దృష్టి: ఆర్జేడీ శారద

ఆలమూరు, జూలై 31: ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న రెండు అధ్యాపక పోస్టులను తక్షణం భర్తీ చేస్తామని రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఐ.శారద తెలిపారు. బుధవారం కళాశాల సందర్శనకు వచ్చిన ఆమె అభివృద్ధి కమిటీ సభ్యులు గుణ్ణం వీర్రాజు, గారపాటి త్రిమూర్తులుతో చర్చించారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని, పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను తక్షణం భర్తీ చేయడంతో పాటు కళాశాల అభివృద్ధికి సహకరిస్తానని చెప్పారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.



వీరేశ్వరుని ఆలయంలో డీఎస్పీ పూజలు

ఐ.పోలవరం, జూలై 31: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో అమలాపురం డీఎస్పీ ఎం.ఉమామహేశ్వరరావు బుధవారం పూజలు చేశారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం ఇవ్వగా అర్చకులు స్వామివారి చిత్రపటం బహూకరించారు. డీఎస్పీ వెంట పోలవరం ఎస్ఐ భానుప్రసాద్ ఉన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

కె.గంగవరం, జూలై 31: బ్రహ్మపురిలో వరద బాధిత కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలను కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం పంపిణీ చేశారు. కూళ్ల గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. కూటమి నాయకులు చొల్లంగి ఎదుర్లయ్య, మేడిశెట్టి ఇజ్రాయిల్, శివ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 36 మందికి ఉద్యోగాలు

ద్రాక్షారామ, జూలై 31: ద్రాక్షారామలోని శ్రీనివాస శైల పారిశ్రామిక శిక్షణా సంస్థలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళా నిర్వహించారు. 36 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసి నియామక పత్రాలు అందించినట్టు ప్రిన్సిపాల్ చోడి సత్యనారాయణ తెలిపారు. హెచ్ఆర్ జోసఫ్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్వీజీ శ్రీనివాస్, సిబ్బంది యనమదల శ్రీనివాసరావు, గంగిశెట్టి భీమేశ్వరరావు, చోడ సత్యప్రకాష్, డి.జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి పాముకాటు

అంతర్వేది, జూలై 31: సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంకకు చెందిన మోకా అయ్యప్ప బుధవారం బయటికి వెళ్లేందుకు మోటారు సైకిలు తీస్తుండగా పాము కాటు వేసింది. స్థానికుల సమాచారంతో వైద్య సిబ్బంది టీటీ ఇంజక్షన్ చేసి ప్రాథమిక చికిత్స అందించారు. రెండు రోజులుగా పాముల బెడద ఎక్కువవ్వడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి గాయత్రి కోరారు. ఏపీవో నాగప్రసాద్, స్థానిక పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. బుధవారం ప్రాథమిక వైద్య అందించిన అయ్యప్పను మెరుగైన వైద్య కోసం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు వైద్యాధికారులు తెలిపారు.

డాబాను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం

అంబాజీపేట, జూలై 31: ఇరుసుమండ మెయిన్‌రోడ్డులో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆకుల రాంబాబుకు చెందిన డాబా ప్రహరీ ధ్వంసమైంది. పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొనడంతో వైర్లు ధ్వంసమయ్యాయి. అయితే ఆ ఇంటి యజమాని లేచి లారీని వెంబడించినా ఆచూకీ తెలియలేదు. నిద్రమత్తులో ఈ ఘటన జరిగినట్టు తెలుస్తోంది.

తూర ఏర్పాటుతో మురుగు సమస్య పరిష్కారం

మామిడికుదురు, జూలై 31: నగరం చాకలిచెరువు ప్రాంతంలో కొత్తగా తూర ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైంది. తూర శిథిలమవ్వడం వల్ల వర్షాల వల్ల తమ పంట పొలాల్లో చేరిన మురుగునీరు బయటికి పోవట్లేదని రైతులు సోమవారం ఆందోళన చేశారు. దీనికి స్పందించిన పంచాయతీ అధికారులు శిథిలమైన తూర స్థానే కొత్త తూరను బుధవారం ఏర్పాటు చేశారు.

మర్యాదపూర్వకంగా..

అమలాపురం టౌన్, జూలై 31:

కాపునాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుల బృందం బుధవారం సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. కాపునాడు నాయకులు పత్తి దత్తుడు, అబ్బిరెడ్డి సురేష్, వల్లభరెడ్డి వాసు, గారపాటి బాలాజీ, అబ్బిరెడ్డి మూర్తి, గుర్రాల రమేష్, మండపాక కాశీ తదితరులు పాల్గొన్నారు.